క్లుప్తంగా

నేడు విద్యుత్‌ సరఫరాలో అంతరాయం

పులివెందుల రూరల్‌ : పట్టణంలో సోమవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్‌ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్‌శాఖ ఏఈఈ జగదీశ్వర్‌ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 33/11 కేవీ సబ్‌స్టేషన్‌ మెయింటెనెన్స్‌ కారణంగా ఈ సబ్‌స్టేషన్‌ ఫీడర్‌ కింద ఉన్న మెయిన్‌రోడ్డు, అంబకపల్లె రోడ్డు, బైపాస్‌ రోడ్డు, లేఔట్‌, ఎస్‌బీఐ కాలనీ, కడపరోడ్డులో విద్యుత్‌ సరఫరా అంతరాయం ఏర్పడుతుందని ఆయన తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

మార్కెట్‌ యార్డు చైర్మన్‌ రాజీనామా



మార్కెట్‌ యార్డు చైర్మన్‌కు రాజీనామా పత్రాన్ని అందిస్తున్న ఎన్‌సీ పుల్లారెడ్డి

కమలాపురం : కమలాపురం మార్కెట్‌ యార్డు చైర్మన్‌ ఎన్‌సీ పుల్లారెడ్డి తన పదవికి రాజీనామా చేశారు. ఆదివారం తన రాజీనామా పత్రాన్ని యార్డు సెక్రటరీ వరప్రసాద్‌రెడ్డికి అందజేశారు. రాష్ట్రంలో వైఎస్సార్‌ సీపీ ప్రభుత్వం కోల్పోవడంతో నైతిక బాధ్యత వహిస్తూ రాజీనామా చేసినట్లు ఎన్‌సీ పుల్లారెడ్డి తెలిపారు. తనకు ఈ పదవి ఇచ్చినందుకు సహకరించిన మాజీ సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి, ఎంపీ వైఎస్‌ అవినాష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డిలకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు.

ఉల్లాసంగా స్కేటింగ్‌ పోటీలు



స్కేటింగ్‌ పోటీలో పాల్గొన్న క్రీడాకారులు

ఎర్రగుంట్ల : పట్టణంలోని కింగ్స్‌ స్కేటింగ్‌ అకాడమి ఆధ్వర్యంలో జిల్లాస్థాయి స్కేటింగ్‌ పోటీలను ఆదివారం నిర్వహించినట్లు అకాడమి నిర్వాహకులు తెలిపారు. ఈ పోటీలను మాజీ మార్కెట్‌ యార్డు చైర్మన్‌ సూర్యనారాయణరెడ్డి ప్రారంభించారు. ఈ పోటీలు అండర్‌ 4, 6, 8, 10, 12, 14 విభాగాలలో నిర్వహించారు. ఇందులో 100 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. విజేతలుగా నిలిచిన క్రీడాకారులు ఈనెల 16వ తేదీన కర్నూల్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారన్నారు. విజేతలకు సర్టిఫికెట్లు, బహుమతులు అందజేశారు.

ముగిసిన గ్రంథాలయ సమ్మర్‌ క్యాంపు



బహుమతులు అందజేస్తున్న గ్రంథాలయ అధికారిని గంగాదేవి

సింహాద్రిపురం : మండలంలోని కోరుగుంటపల్లెలో మే 17 నుంచి జూన్‌ 7 వరకు గ్రంథా లయ సమ్మర్‌ క్యాంపు నిర్వహించారు. ఆదివారం ముగింపు సందర్భంగా గ్రంథాలయ అధికారిని గంగాదేవి, విద్యార్థులకు, పిల్లలకు కథలు చెప్పడం, రాయడం వంటి కార్యక్రమాలు చేపట్టారు. అలాగే విద్యార్థులకు పిల్లలకు కథల పోటీలు, ఆటల పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

భక్తి శ్రద్ధలతో గంగమ్మతల్లికి పూజలు



ప్రత్యేక అలంకరణలో గంగమ్మతల్లి

వీరపునాయునిపల్లె : సకాలంలో వానలు పడి పంటలు బాగా పండాలని తలపనూరు పంట పొలాల్లో వెలసిన గంగమ్మతల్లికి ఆదివారం భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు అమ్మవారిని అత్యంత సుందరంగా అలంకరించారు. మండలంలోని పలు గ్రా మాల ప్రజలు కుటుంబ సభ్యులతో కలసి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించారు. అమ్మవారిని దర్శించుకొన్న భక్తులకు అర్చకులు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ఘనంగా పోలేరమ్మ జాతర

బద్వేలు అర్బన్‌ : పట్టణంలోని రూపారంపేటలోని పోలేరమ్మ ఆలయంలో జాతర సందర్భంగా ఆదివారం నిర్వహించిన బోనాల కార్యక్రమం భక్తిశ్రద్ధలతో అత్యంత వైభవంగా జరిగింది. మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చి పోలేరమ్మతల్లికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామం సుభిక్షంగా ఉండటంతో పాటు వర్షాలు సమృద్ధిగా కురిసి పాడి పంటలతో విరిసిల్లాలని కోరుతూ పోలేరమ్మతల్లి బోనాలు సమర్పించారు.

శిల్పారామంలో అలరించిన నృత్య ప్రదర్శనలు



తిలకిస్తున్న సందర్శకులు



శాస్త్రీయ నృత్య ప్రదర్శనలో చిన్నారులు

పులివెందుల టౌన్‌ : స్థానిక శిల్పారామంలో ఆదివారం వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా నృత్య ప్రదర్శనలు అలరించాయి. సండే కావడంతో శిల్పారామం సందడిగా కనువిందు చేసింది.

అక్కడ ఉన్న ఊయలలు, జారుడుబండలు, జిప్‌వే, బోటింగ్‌ సికార్లు కొడుతూ ఎంజాయ్‌ చేశారు. రౌడీ మెమో కేఫ్‌, సిరి సంజీవని ది మిల్లెట్స్‌ కేఫ్‌ వారి సౌజన్యంతో యువరాజ డ్యాన్సింగ్‌ స్కూల్‌ మాస్టర్‌ యువకిషోర్‌ సమ్మర్‌ క్యాంప్‌ ముగింపు వేడుకలలో నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు సందర్శకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. తదితర పాటలకు నృత్య కళాకారులు వేసిన చిందులకు శిల్పారామం కేరింతలతో ఉత్సాహంగా గడిపారు. శిల్పారామం నిండుగా కనువిందు చేసింది. కార్యక్రమంలో శిల్పారామం ఏఓ సుధాకర్‌, నిర్వాహకులు ప్రకాష్‌, ప్రియతమ్‌, సిబ్బంది పాల్గొన్నారు.

నిలకడలేని సబ్‌-రిజిస్ట్రార్‌లతో ఇక్కట్లు



సబ్‌రిజిస్ట్రార్‌ లేక ఖాళీగా వున్న కుర్చీ

ముద్దనూరు : ప్రభుత్వానికి నిత్యం ఆదాయం గడించే రిజిస్ట్రేషన్‌ శాఖలో ప్రధాన ఉద్యోగి సబ్‌రిజిస్ట్రార్‌, అయితే గత కొద్ది నెలలుగా ముద్దనూరు సబ్‌-రిజిస్ట్రేషన్‌ కార్యాలయంలో సబ్‌రిజిస్ట్రార్ల నిలకడలేనితనంతో రిజిస్ట్రేషన్లు మందకొడిగా సాగుతున్నాయి. స్థానిక కార్యాలయంలో సుమారు ఏడాది కాలంనుంచి పనిచేస్తున్న సబ్‌రిజిస్ట్రార్లు 2 నెలలకొకసారి డిప్యూటేషన్లపై చక్కర్లు కొడుతుండటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ముద్దనూరు, కొండాపురం, వీరపునాయనిపల్లె మండలాలకు చెందిన రిజిస్ట్రేషన్లకు నిలయమైన కార్యాలయంలో 3 నెలల నుంచి సబ్‌రిజిస్ట్రార్‌ పోస్టు ఖాళీగావుంది. ఇక్కడ పనిచేస్తున్న సబ్‌రిజిస్ట్రార్‌ మహమ్మద్‌ బాషా 3 సార్లు డిప్యూటేషన్‌పై బదిలీ అయ్యారు. ఈయన స్థానంలో వచ్చిన సబ్‌రిజిస్ట్రార్‌ మృణాళిని 6 నెలలు పనిచేసి బదిలీపై వెళ్ళారు. తిరిగి ఆమె స్థానంలో మహమ్మద్‌ బాషాను నియమించారు. తరచూ సబ్‌రిజిస్ట్రార్‌ బదిలీ కావడంతో ఇన్‌చార్జి పాలన సాగుతోంది. కార్యాలయంలో కేవలం ఒక అధికారి, మరో అటెండరు మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. ఇన్‌చార్జి అధికారి ఒక్కరే విధుల్లో వుండటంతో అతనికి బాధ్యతలు అధికమవుతున్నాయని దీంతో రిజిస్ట్రేషన్ల ప్రక్రియ అధ్వానంగా మారిందని బాధితులు వాపోతున్నారు. దూరప్రాంతాల నుంచి వచ్చి అమ్మకందారులు, కొనుగోలుదార్లు తమ పనులు పూర్తికాకపోవడంతో వ్యయప్రయాసలకు గురవుతున్నారు. 3 మండలాలకు సేవలందించే కార్యాలయంలో శాశ్వత సబ్‌రిజిస్ట్రార్‌ను, సిబ్బందిని నియమించాలని స్థానికులు కోరుతున్నారు.

భగవద్గీత పఠనం అలవరచుకోవాలి



ఇస్కాన్‌ స్పెషల్‌ క్యాంప్‌కు ర్యాలీగా వెళ్తున్న చిన్నారులు

కమలాపురం : ప్రతి ఒక్కరూ విద్యార్థి దశ నుంచే భగవద్గీత శ్లోకాలను పఠించడం అలవరచుకోవాలని ప్రొద్దుటూరుకు చెందిన ఇస్కాన్‌ సంస్థకు చెందిన ప్రతినిధులు శబరీష్‌, రామాంజనేయులు తెలిపారు. 20 రోజుల నుంచి స్థానిక శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరీదేవి ఆలయంలో చిన్నారులకు ఇస్కాన్‌ ఆధ్వర్యంలో సమ్మర్‌ క్యాంప్‌ నిర్వహించి అందులో భాగంగా భగవద్గీత శ్లోకాల పఠనంపై చిన్నారులకు వారు శిక్షణ నిచ్చారు. ఆదివారం ప్రొద్దుటూరులో ఇస్కాన్‌ నిర్వహించిన స్పెషల్‌ క్యాంప్‌కు కమలాపురంకు చెందిన విద్యార్థులు బయలు దేరి వెళ్లారు. శిక్షణ పొందిన చిన్నారులు వాసవీ కన్యకాపరమేశ్వరీ ఆలయం వద్ద నుంచి నగర పంచాయతీ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లారు. ర్యాలీలో చిన్నారులు హరినామ సంకీర్తన చేసుకుంటూ సందడిగా కనిపించారు. అక్కడి నుంచి ప్రత్యేక వాహనాల్లో ప్రొద్దుటూరుకు తరలి వెళ్లారు. ఈ సందర్భంగా శబరీష్‌, రామాంజనేయులు మాట్లాడుతూ విద్యార్థులకు చిన్ననాటి నుంచే భగవద్గీత పఠనంపై ఆసక్తి పెంచేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఇస్కాన్‌ చేపట్టిందన్నారు. వీటి ద్వారా మంచి ఫలితాలు అందుతున్నాయన్నారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య భక్తులు పాల్గొన్నారు.

డైరెక్టర్‌ పదవికి రాజీనామా



వీరప్రతాప్‌రెడ్డి

వీరపునాయునిపల్లె : రాష్ట్ర మినరల్‌ డెవలప్‌మెంటు కార్పొరేషన్‌ డైరెక్టర్‌ పదవికి రాజీనామా చేస్తున్నట్లు లింగారెడ్డి వీరప్రతాప్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో వైఎస్సార్‌ కాంగ్రెస్‌ పార్టీ అధికారం కోల్పోవడంతో నైతిక బాధ్యత వహిస్తూ రాజీనామా పత్రాన్ని మైనింగ్‌ ఎండీ యువరాజ్‌కు పంపినట్లు ఆయన తెలియజేశారు.

బీఎంఎస్‌ ఐక్యతను బలోపేతం చేయండి

ఎర్రగుంట్ల : భారతీయ మజ్దూర్‌ సంఘ్‌(బీఎంఎస్‌)ను ఐక్యతను చాటి బలోపేతం చేయడానికి శిక్షణ తరగతులు చాలా ఉపయోగపడుతాయని ఆంధ్ర రాష్ట్ర పవర్‌ ఎంప్లాయిస్‌ యూనియన్‌ రాష్ట్ర అధ్యక్షుడు చౌటిపల్లి రాంగోపాల్‌రెడ్డి తెలిపారు. ఆదివారం విజయవాడలోని యూనియన్‌ కార్యాయలంలో జరిగిన శిక్షణ తరగతులకు ఆర్టీపీపీ నుంచి బీఎంఎస్‌ నాయకులు పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ శిక్షణ తరగతులు విలువైన జ్ఞానాన్ని అందిస్తాయన్నారు.

విద్యతో ఉజ్వల భవిష్యత్తు

ప్రొద్దుటూరు కల్చరల్‌ : విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు సాధ్యమని డిప్యూటీ ఎగ్జిక్యూటివ్‌ ఇంజనీర్‌ గంజికుంట రాజగోపాల్‌ పేర్కొన్నారు. స్థానిక తొగటవీర క్షత్రియ ఉద్యోగులు, వృత్తి నిపుణుల సంక్షేమ సంఘం కార్యాలయంలో ఆదివారం తొగటవీర విద్యార్థులకు ప్రతిభా పురస్కారాల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకోవాలని సూచించారు. లక్ష్యాన్ని నిర్దేశించుకుని భవిష్యత్‌కు బంగారు బాట వేసుకోవాలని ఆకాంక్షించారు. ఏపీ టెక్స్‌టైల్స్‌ అసోసియేషన్‌ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పల్లా శేషయ్య మాట్లాడుతూ ప్రతిభ గల తొగట వీర విద్యార్థులకు విద్యాభివృద్ధికి సహాయ సహకారాలు అందిస్తానన్నారు. సంఘం అధ్యక్షుడు ఇడెం లక్ష్మీనారాయణ మాట్లాడుతూ తొగటవీర విద్యార్థులకు ప్రోత్సహించాలనే ఉద్దేశంతో సంఘం ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలో చదవి 10వ తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రతిభా పురస్కాలను అందిస్తున్నామని తెలిపారు. ఇంజనీరింగ్‌ విద్యార్థికి రూ.11 వేలు ఆర్థిక సహాయం, 23 మంది 10వ తరగతి విద్యార్థులకు మొత్తం రూ.47 వేలను నగదు ప్రోత్సాహక బహుమతులుగా అందజేశారు.

నీట్‌ ఫలితాలపై విచారణ చేయాలి

ప్రొద్దుటూరు కల్చరల్‌ : నీట్‌ ఫలితాలపై సమగ్ర విచారణ జరిపించాలని ఏఐఎస్‌ఎఫ్‌ జిల్లా కార్యదర్శి వలరాజు డిమాండ్‌ చేశారు. ఆదివారం శివాలయం సర్కిల్‌లో ఏఐఎస్‌ఎఫ్‌ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 4న వెలువడిన నీట్‌ పరీక్షా ఫలితాలపై అనేక అనుమానాలు వ్యక్త మవుతున్నాయని తెలిపారు.

దేశవ్యాప్తంగా 24 లక్షల మంది నీట్‌ పరీక్షకు దరఖాస్తు చేసుకోగా 23.33లక్షల మంది పరీక్షకు హాజరయ్యారన్నారు. దేశవ్యాప్తంగా 65 మంది విద్యార్థులకు ఒకే ర్యాంకు రావడం, హర్యానాలోని ఓ పరీక్షా కేంద్రానికి చెందిన 6 మంది విద్యార్థులకు ఒకే మార్కులు రావడం అనుమానాలకు దారి తీస్తోందన్నారు. అలాగే అదే పరీక్షా కేంద్రానికి చెందిన విద్యార్థులు ఇద్దరికి ఒకే ర్యాంకు వచ్చిందని ఇది ఎలా సాధ్యమని ప్రశ్నించారు. దీనిపై నేషనల్‌ టెస్టింగ్‌ ఏజెన్సీని వివరణ కోరగా పరీక్ష ఆలస్యంగా మొదలైనందున 1563 మంది విద్యార్థులకు మార్కులు కలిపామనిచెప్పారన్నారు. మార్కులు కేటాయింపు కూడా పారదర్శకంగా జరుగలేదని విమర్శించారు.

విద్యార్థుల అపూర్వ సమ్మేళనం



అప్పటి ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

ఎర్రగుంట్ల : పట్టణ పరిధిలోని జిల్లా పరిషత్‌ బాలుర ఉన్నత పాఠశాలలో పదవ తరగతి 1988–89 బ్యాచ్‌ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం జరిగింది. అప్పటి ఉపాధ్యాయులను ప్రత్యేకంగా ఆహ్వానించి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా అప్పటి ఉపాధ్యాయులు మాట్లాడుతూ 35 ఏళ్ల కిందట పాఠాలు చెప్పినందుకు మమ్మల్ని పిలిచి ఘనంగా సన్మానించడం చాలా సంతోషకరమన్నారు. ప్రస్తుతం విద్యార్థులు ఎంతో అభివృద్ధి చెందారన్నారు. అనంతరం పూర్వ విద్యార్థులు వారి కుటుంబ సభ్యులతో కలసి వారి చిన్న నాటి తీపి గుర్తులను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామాంజనేయ రెడ్డి, వృత్తి విద్య ఉపాధ్యాయులు చంద్ర ఓబుళరెడ్డి, పూర్వ విద్యార్థుల అప్పటి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యలపై రాజీలేని పోరాటం



ఎస్‌టీయూ జెండాను ఏగురవేస్తున్న నాయకులు

జమ్మలమడుగు : ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం ఎస్‌టీయూ రాజీలేని పోరాటం చేస్తుందని ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర నాయకుడు గురుకుమార్‌ తెలిపారు. ఆదివారం ఎస్‌టీయూ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా రీజనల్‌ కన్వీనర్‌ ప్రతాప్‌రెడ్డి అధ్యక్షతన ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. గురుకుమార్‌ మాట్లాడుతూ 78 సంవత్సరాల చరిత్ర కలిగిన ఎస్‌టీయూలో సభ్యులుగా ఉన్న విజయరామారాజు, ముగ్దుం మోహినుద్దీన్‌, పి.వి.రాఘవచారిలు ఉపాధ్యాయుల సమస్యలపై పోరాడారన్నారు. వారి స్ఫూర్తితో పోరాటాన్ని చేస్తున్నామన్నారు. రాష్ట్రంలో జీవో 117ను రద్దుచేయాలన్నారు. అనంతరం విశ్రాంత ఉపాధ్యాయుడు ఎం.ఎల్‌.కృష్ణారెడ్డిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రంగేశ్వరరెడ్డి, మహమ్మద్‌ గౌస్‌ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నేతల సంబరాలు



నాగలగుట్టపల్లెలో సంబరాలు చేసుకుంటున్న బీజేపీ నేతలు

చక్రాయపేట : భారత ప్రధానిగా నరేంద్రమోదీ మూడవ సారి ప్రధాన మంత్రిగా ప్రమాణ స్వీకారం చేస్తున్న సందర్భంగా ఆదివారం సాయంత్రం మండలంలోని నాగలగుట్టపల్లెలో బీజేపీ నేతలు సంబరాలు జరుపుకున్నారు. నాగలగుట్టపల్లెలోని గ్రామీణ గ్రంథాలయం వద్ద నున్న వివేకానందుడి విగ్రహం వద్ద నరేంద్రమోదీ చిత్రపటాన్ని ఉంచి సంబరాలను బీజేపీ జాతీయ కౌన్సిల్‌ సభ్యుడు రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో చేసుకున్నారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి రాజారెడ్డి, బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు దశరథ, వేమారెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

చెన్నూరులో..

చెన్నూరు : భారతదేశ ప్రధానమంత్రిగా నరేంద్రమోదీ మూడవసారి ప్రమాణస్వీకారం చేసిన సందర్భంగా మండల బీజేపీ నాయకులు ఆదివారం శ్రీ హనుమాన్‌ 15 అడుగుల చిత్రపటాన్ని ఏర్పాటు చేసి ప్రజలకు స్వీట్స్‌ పంపిణీ చేశారు. కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

● సాగు సమయం



సేద్యం చేస్తున్న రైతన్న

పులివెందుల రూరల్‌ : ప్రస్తుతం వర్షాలు కురుస్తుండటంతో రైతులు పొలం పనుల్లోకి దిగారు. వారం రోజులుగా పొలం పనుల్లో రైతన్నలు బిజీ బిజీగా ఉన్నారు.

అలాగే మరో పక్క ఖరీఫ్‌ సీజన్‌ ప్రారంభం కావడంతో విత్తనాలు వేసేందుకు రైతులు పొలాలను సిద్ధం చేస్తున్నారు. ట్రాక్టర్లు, ఎద్దులతో పొలాల్లో దుక్కిలు చేయడం, గట్లు బాగు చేయడం పనుల్లో రైతులు నిమగ్నమయ్యారు. మరో వైపు రైతులకు విత్తనాలను సంబంధిత వ్యవసాయ అధికారులు ఇచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

వన్నెతగ్గని మట్టిపాత్రలు



మార్కెట్‌లో విక్రయానికి సిద్ధంగా ఉన్న మట్టికుండలు

పులివెందుల రూరల్‌ : సాంకేతిక పరిజ్ఞానంలో విప్లవాత్మకమైన మార్పులు చోటుచేసుకున్నా... మట్టిపాత్రలకు మాత్రం ఏ మాత్రం వన్నె తగ్గలేదు. ఎప్పటికప్పుడు కాలానుగుణంగా ప్రజలకు అవసరానికి తగ్గట్టుగా మట్టిపాత్రలు తయారుచేస్తున్నారు. వివిధ రకాల అల్యూమినియం, తదితర వస్తువులు మార్కెట్‌లో లభిస్తున్నప్పటికీ ప్రాచీనకాలం నుంచి మట్టిపాత్రలకు ఆదరణ ఉంది. మట్టితో తయారైన పాత్రలు ఉపయోగం ఎంతో మంచిదని పెద్దలు చెప్తున్నారు. మట్టిబానలు, కుండలు, కడవలు, మూకట్లు తదితర వాటిని ఎంతో నైపుణ్యంతో తయారుచేస్తారు. పులివెందుల ప్రాంతంలోని బ్రాహ్మణపల్లె, మడూరు, ముతుకూరు గ్రామాల్లో మట్టిపాత్రలు తయారు చేయడంలో ఎంతో పేరు సాధించాయి. ప్రస్తుతం మార్కెట్లో వివిధ రకాల మట్టి పాత్రలు అందుబాటులోఉన్నాయి. పేదలు మాత్రం చాలా మంది ఇప్పటికీ మట్టిపాత్రలను వినియోగిస్తున్నారనడంలో సందేహం లేదు.

ఉపాధి ఊతం.. రైతులకు లాభం



రాజుపాళెంలో కేసీ చాపాడు కాలువ వెంబడి కంపచెట్లను కొడుతున్న కూలీలు

రాజుపాళెం: వ్యవసాయ ఇతర పనులు పెద్దగా లేకపోవడంతో గ్రామాల్లో కూలీలతో పాటు చిన్న, సన్నకారు రైతులు ఉపాధి పనులవైపు మొగ్గు చూపుతున్నారు. జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో కొంతమంది రహదారుల్లో ఉన్న కంపచెట్లను తొలగిస్తుండగా, మరికొన్ని గ్రామాల్లో కుంటల్లో, పంట కాలువల్లో, ఉప కాలువల్లో, చెక్‌డ్యాంలో, ఫారంపాండ్‌లలో పూడికతీత పనులు చేస్తున్నారు. పూడికతీత పనులు సాగుకు ఎంతో ఉపయోడపడుతున్నాయి. మండలవ్యాప్తంగా 3,000 మంది కూలీలు ఉపాధి పనులు చేస్తున్నట్లు మండల ఏపీఓ లక్ష్మి నారాయణ తెలిపారు. అయితే గత నాలుగైదు రోజులుగా అక్కడక్కడా వర్షం పడుతుండటంతో పనులు చేయడం లేదని చెప్పారు.

అధైర్యపడొద్దు .. అండగా ఉంటాం



కలసపాడు : నాయకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే

బద్వేలు అర్బన్‌ : వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఎవరూ అధైర్యపడొద్దని, ఎల్లవేళలా అండగా ఉంటామని ఎమ్మెల్యే డాక్టర్‌ సుధ పేర్కొన్నారు. ఆదివారం ఎన్‌జీఓ కాలనీలోని ఎమ్మెల్యే నివాసంలో పలువురు నాయకులు ఎమ్మెల్యేను కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల్లో గెలుపోటములు సర్వసాధారణమని అన్నారు. తన విజయానికి శక్తివంచన లేకుండా కృషి చేసిన ప్రతిఒక్కరికి పేరుపేరున కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో వైవీయూ పాలక మండలి సభ్యులు కొండపల్లి చిన్నసుబ్బారావు, ఆర్యవైశ్య మహిళా మండలి రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కొండపల్లిదేవి, మార్కెట్‌ యార్డు వైస్‌చైర్మన్‌ నాగం సుబ్బారెడ్డి, గోపవరం మండల కన్వీనర్‌ మల్లికార్జునరెడ్డి, ఎంపీటీసీ సరస్వతి, మున్సిపాలిటీ నాయకులు రఘురామిరెడ్డి, శివారెడ్డి, రామిరెడ్డి, శంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

జాతరలో పాల్గొన్న ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే

కలసపాడు : మండలంలోని పిడుగుపల్లె గ్రామంలో పోలేరమ్మ జాతరలో ఎమ్మెల్సీ డీసీగోవిందరెడ్డి ఎమ్మెల్యే డాక్టర్‌ సుధ పాల్గొన్నారు. పిడుగుపల్లె గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు పాలకొలను వెంకటరెడ్డి, ముత్యాల నారాయణరెడ్డి ఆహ్వానం మేరకు ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే జాతరలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు అండగా ఉంటామని, అందరూ ధైర్యంగా ఉండాలని తెలిపారు. మాజీ మార్కెట్‌యార్డు వైస్‌చైర్మన్‌ కె.రమణారెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల నాయకులు పాల్గొన్నారు.

ఎర్రగుంట్లలో పడకేసిన పారిశుద్ధ్యం

ఎర్రగుంట్ల : ఎర్రగుంట్ల మున్సిపల్‌ పరిధిలో పారిశుద్ధ్యం పడకేసింది. మున్సిపాలిటీలో పారిశుద్ధ్య కార్మికులు ఉన్న వీధులలో మాత్రం డ్రైనేజీ పూడికలు, చెత్తచదారం అక్కడిక్కడే నిల్వ ఉంటున్నాయి. దీంతో పట్టణ పరిధిలో పందులు స్వైరవిహారం చేస్తున్నాయి. దీనికి తోడు దోమలు విలయతాండం చేస్తున్నాయని పట్టణ ప్రజలు వాపోతున్నారు. మున్సిపల్‌ పరిధిలో పారిశుద్ధ్య కార్మికులు అధికంగా సంఖ్యలో పనిచేస్తున్నారు. అయితే కార్మికులందరు ప్రతి రోజు ఉదయాన్నే ప్రధాన రహదారుల్లో మాత్రమే రోడ్లను ఊడుస్తున్నారు. ఇతర కాలనీల వీధులను పట్టించుకోలేదన్నారు. పందులు మాత్రం ప్రతి వీధిలో స్వైర విహారం చేస్తూ మనుషులపై దాడు చేస్తున్నాయని పలుమార్లు మున్సిపల్‌ అధికారులకు ఫిర్యాదులు చేస్తున్నా పట్టించుకోలేదన్నారు. ఇప్పటికైన మున్సిపల్‌ అధికారులు స్పందించి ప్రధాన రహదారులతో పాటు వీధులను శుభ్రం చేయాలని స్థానికులు కోరుతున్నారు.



ఎర్రగుంట్ల మున్సిపల్‌ పరిధిలో సైర్వ విహారం చేస్తున్న పందులు



సుందరయ్యనగర్‌ కాలనీలో పూడిక ఏర్పడిన డ్రైనేజీ

పాలాభిషేకం

ఎర్రగుంట్ల : భారత ప్రధానమంత్రి నరేంద్రమోదీ చిత్ర పటానికి ఆదివారం పట్టణంలోని నాలుగు రోడ్ల కూడలిలో బీజేపీ మండలాధ్యక్షుడు మేకల జగన్‌మోహన్‌ రెడ్డి ఆధ్వర్యంలో పాలాభిషేకం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ, తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.